వారికి కాసులు.. వీరికి కష్టాలు

- యథేచ్ఛగా గోదావరిలో అక్రమ తవ్వకాలు
- లంక భూములకు తీవ్ర నష్టం
- అక్రమార్కులకు కాసుల పంట
- అన్నదాతలకు అపార నష్టం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పొట్టిలంక శివారున నదీ గర్భంలో మట్టి, ఇసుక రవాణా కోసం అక్రమ తవ్వకందారులు ఏర్పాటు చేసిన రోడ్డు

కడియం: ధవళేశ్వరం బ్యారేజీకి దిగువ ఉన్న గోదావరి లంక ప్రాంతంలో అక్రమంగా ఇసుక, మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా లంక మట్టిని అక్రమార్కులు చీకటి మాటున తరలించుకుపోతున్నారు. పొట్టిలంక గ్రామం పరిధిలోని ఏటిగట్టు నుంచి దాదాపు కిలోమీటర్ లోపల ర్యాంపును ఏర్పాటు చేసుకుని, ఐదు మార్గాల గుండా ఈ మట్టి తరలింపు యథేచ్ఛగా సాగుతోందని స్థానిక రైతులు చెబుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో జరిగే ఈ అక్రమ తవ్వకాల కారణంగా దిగువన ఉన్న లంక భూములు నదీ కోతకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరో అక్రమ సంపాదన కోసం తమ భూములను కోల్పోవాల్సి వస్తోందంటున్నారు. అధికార యంత్రాంగం కళ్లు మూసుకోవడంతో నాణ్యమైన పంటలు పండే లంక భూములు నదీగర్భంలో కలిసిపోతున్నాయంటున్నారు.

అక్రమ తవ్వకాల్లో భాగస్వాములు

కడియపులంకకు చెందిన జేసీబీ యజమానితో పాటు, కొత్తపేట మండలానికి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, ప్రజాప్రతినిధులు అక్రమ తవ్వకాల్లో భాగస్వాములని బాహాటంగానే చెబుతున్నారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ సిబ్బందికి మామూళ్లు చెల్లించి, వీరంతా ఈ అక్రమ మట్టి తవ్వకాలకు తెర తీసినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. రెండు రోజుల క్రితం రాత్రి పూట జరుగుతున్న లంక మట్టి తవ్వకాలను కొందరు అడ్డుకుని రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి సమాచారం ఇచ్చారు. దీంతో పొట్టిలంక గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత సిబ్బందితో కలిసి అక్రమ తవ్వకాలు సాగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే గోదావరి లంక ప్రాంతంలో భూముల సరిహద్దుల విషయంలో ఎప్పటి నుంచో వివాదం నడుస్తోంది. ఈ వివాదం నేపథ్యంలో కొన్ని వందల ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ కార్యకలాపాలు సాగించడం లేదు. దీనిని అదనుగా చేసుకుని అక్రమార్కులు మట్టి, ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారు.

రవాణాకు మరో మార్గం

అక్రమ తవ్వకాలు చేసే చోటు నుంచి మట్టి, ఇసుకను ఎటువంటి ఇబ్బందులు లేకుండా తరలించుకుపోవడానికి అక్రమార్కులు వినూత్న మార్గాలను ఏర్పాటు చేసుకున్నారు. తవ్వకాలు సాగించే చోటు నుంచి ఇటు కడియం మండలం, అటు ఆలమూరు మండలం బడుగువాని లంక మీదుగా వెళ్లేందుకు దాదాపు ఐదు మార్గాలను ఏర్పాటు చేసుకున్నారని గోదావరి లంకల్లోని రైతులు చెబుతున్నారు. ఒక వేళ ఏ పక్కనుంచైనా అధికారులుగానీ, ప్రజలుగానీ అడ్డుకోవడానికి వస్తే మరో మార్గం గుండా వాహనాలు, యంత్రాలను తరలించి తప్పించుకుంటున్నారంటున్నారు.

క్షేత్ర స్థాయి సిబ్బంది చేతివాటం

గ్రామ స్థాయిలో ఎక్కడ ఏం జరుగుతుందన్నది క్షేత్రస్థాయిలో పనిచేసే రెవెన్యూ సిబ్బందికి పక్కా సమాచారం ఉంటుంది. అయినప్పటికీ విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు సాగుతున్నాయంటే గ్రామ స్థాయి సిబ్బందిని ఈ అక్రమార్కులు ఏ విధంగా మేనేజ్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చునని రైతులు చెబుతున్నారు. భారీ ఎత్తున డబ్బులు చేతులు మారుతున్న కారణంగానే అక్రమ తవ్వకం దారులు రెచ్చిపోతున్నారని వివరిస్తున్నారు.

భూముల కోత

ఎగువ ప్రాంతాల్లో మట్టి దిబ్బలను అక్రమంగా తవ్వేయడం కారణంగా దిగువన లంక భూములు కోతకు గురవుతున్నాయి. ఎంతో మంది రైతులు భూములు కోల్పోయి ఇబ్బంది పడుతున్నారు.

– పి.సురేష్, లంక రైతు

ఇక భూములు మిగలవు

అక్రమ తవ్వకాలు ఇదే రీతిన సాగుతుంటే దిగువన భూములు మిగలవు. అన్నీ గోదావరి కోతకు గురవుతాయి. ఎకరం విస్తీర్ణంలో మట్టి దిబ్బను తొలగిస్తే దిగువన పదుల ఎకరాలు నదీ గర్భంలో కలిసిపోతాయి.

– యు.సత్యనారాయణ, లంక రైతు.

యథేచ్ఛగా తవ్వకాలు

పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు వస్తున్నాయి, నాలుగైదు జేసీబీలు లంకల్లోకి వచ్చి మట్టి, ఇసుక తవ్వుకుపోతున్నారు. అయినప్పటికీ ఒక్క అధికారి కూడా అటువైపు వచ్చి చూడడం లేదు.

– చంటి, లంక రైతు.

లంక భూములకు ముప్పు

అక్రమ తవ్వకాలను అడ్డుకోకపోతే లంక భూములకు ముప్పు తప్పదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం తక్షణం చర్యలు తీసుకుని, అక్రమ తవ్వకం దారులపై కఠిన చర్యలు చేపట్టాలి.

– ఎస్.ఉమేష్, లంక రైతు.

క్లుప్తంగా

గట్టి మృతికి నాగేశ్వర్ సంతాపం



సత్యనారాయణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: మాజీ సర్పంచ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ గట్టి సత్యనారాయణమూర్తి మృతికి రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ సంతాపం తెలిపారు. ఆయన సోమవారం సత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఈలి గోపాలం, తాడాల చక్రవర్తి, బోడపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

9న ఎస్‌కేవీటీలో జాబ్‌మేళా

సీటీఆర్ఐ: ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి తెలిపారు. కళాశాలలోని వివేకవర్ధిని సెమినార్ హాల్లో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన విద్యార్థులు హాజరుకావచ్చని, హెచ్‌ఆర్, సిస్టమ్ ఆపరేటర్స్, బీపీవో, మార్కెటింగ్, సేల్స్, సర్వీస్, అకౌంటింగ్, కౌన్సిలర్ తదితర ఉద్యోగాలు ఉంటాయన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం దుళ్లలోని ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ బిషప్ ఎస్.జీవరత్నం మందిరంలో నిర్వహించారు. క్రైస్తవ సమాజం సమస్యలపై ఈ సందర్భంగా చర్చించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రముఖులు కరుణాకర్, పరంజ్యోతి, ఏసురత్నం, శామ్యూల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే అధ్యక్షతన దత్తత గ్రామమైన హుకుంపేటలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గవర్నమెంట్ హాస్పిటల్ ఆఫ్తాలమిక్ ఆఫీసర్లు ప్రసన్నకుమార్, డి సాంబయ్య ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.సుభాషిణీదేవి, సచివాలయ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

యువతుల అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు యువతులు అదృశ్యమైన సంఘటనపై సోమవారం కేసులు నమోదయ్యాయి. కోటిలింగాలపేటకు చెందిన యువతి గత నెల 30న తన స్నేహితులు ఇంటికి వెళ్లివస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. క్వారీ సెంటర్‌కు చెందిన యువతి ఈ నెల 5న డ్యూటీకి డీమార్ట్‌కు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కన్నమాంబ పేరాంటాలమ్మ జాతర



అమ్మవారి ఘటాలను తీసుకువచ్చేందుకు వెళుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోట నరసింహారావుపేటలోని కన్నమాంబ పేరాంటాలమ్మ 127వ జాతర సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. దీనిలో భాగంగా నరసింహారావుపేట నుంచి వాయిద్యాలతో వెళ్లి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న కన్నమాంబ పేరాంటాలమ్మ ఆలయం వద్ద పుట్టబంగారం నుంచి ఘటాలను తీసుకువచ్చారు. మంగళవారం రాత్రి నుంచి వీధులలో అమ్మవారి ఘటాల ఊరేగింపు జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కడియం: మండల కేంద్రమైన కడియంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు పాల్గొన్నారు.

జేగురుపాడులో..

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్రస్టాలిన్ అన్నారు. సోమవారం జేగురుపాడులో కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీలు నాగిరెడ్డి రామకృష్ణ, ఆకుల సుధాకర్, స్థానిక నాయకులు మల్లెడ్డి రమేష్, కత్రి చినబాబు పాల్గొన్నారు.

డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించాలి



డ్రైనేజీలపై ఆక్రమణలను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: రోడ్ల విస్తరణకు అడ్డంకిగా ఉన్న డ్రైనేజీలపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని కమిషనర్ కేతన్ గార్గ్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం కోరుకొండ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. శాశ్వత ఆక్రమణలను గుర్తించి, వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. కోరుకొండ రోడ్డును 80 అడుగుల మేర పెంచేందుకు మార్కింగ్ చేయాలనన్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలను ఆకుపచ్చ గుడ్డతో మూసివేసేలా భవన నిర్మాణదారులకు తెలియజేయాలన్నారు.

256 మందికి వైద్య సేవలు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో రామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో సోమవారం సాధారణ, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు యన్నమనేని రామచంద్రరావు, రాయుడు శ్రీనివాస్, సత్యం రమేష్‌బాబు సుమారు 256 మందికి వైద్యసేవలు అందించారు. సాధారణ శిబిరంలో 184 మంది, కంటి వైద్యశిబిరంలో 72 మందికి పరీక్షలు జరిపారు. 13 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని ఉచిత ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, వై.వెంకటనారాయణ, కె శ్రీనివాస్, చంటిబాబు పాల్గొన్నారు.

వైభవంగా మహా కాళేశ్వరాలయ వార్షికోత్సవం



మాజీ ఎంపీ భరత్‌రామ్‌ను సత్కరిస్తున్న పట్టపగలు వెంకటరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేటలోని మహా కాళేశ్వరాలయ (మరో ఉజ్జయిని) తృతీయ వార్షికోత్సవం మూడో రోజు సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. రోటరీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పట్టపగలు వెంకటరావు రెండవ అల్లుడు దండుమేను వెంకట సుబ్బారావు, బాలమాలతీదేవి దంపతుల ఆధ్వర్యంలో శనిభగవానుడి శిఖర యంత్రస్థాపన, స్వామివారికి అన్నాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు మహాన్నసమారాధన జరిగింది. సాయంత్రం జరిగిన శివకల్యాణాన్ని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, నగర ప్రముఖులు తిలకించారు. ఈ సందర్భంగా భరత్, సోము వీర్రాజులను పట్టపగలు వెంకటరావు ఘనంగా సత్కరించారు.

వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి

రంగంపేట: తమ వ్యవసాయ బోర్లకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలని కోరుతూ రైతులు రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దొడ్డిగుంట గ్రామంలో జలకళ పథకంలో తమకు వ్యవసాయ బోర్లు మంజూరు కావడంతో బోర్లు వేయించుకున్నామన్నారు. అయితే అన్ని పనులు పూర్తయినా విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయన్నారు. దీనిపై విద్యుత్తు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విద్యుత్ ఉద్యోగుల జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు



సమావేశంలో పాల్గొన్న నాగేశ్వరరావు, ఇతర నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వీవీఎస్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డివిజన్‌లో సుమారు వందకు పైగా ఖాళీగా ఉన్న జేఎల్‌ఎం, ఏఎల్‌ఎం పోస్టులను భర్తీ చేసే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వలన హైయ్యర్ పెన్షన్ అర్హత కోల్పోయిన ఉద్యోగులకు ఈపీఎఫ్ హైయ్యర్ పెన్షన్ వచ్చేలా సర్కిల్ యాజమాన్యం చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదకరమైన సంస్థలో పని చేస్తున్న కార్మికులకు అపరిమిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. 2022 ఏప్రిల్ ఒకటి వేతన సవరణ ఉద్యోగులందరికీ అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సంఘ డివిజన్ అధ్యక్షుడు సతీష్‌కుమార్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసు, సహాయ కార్యదర్శి కేటీ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు.. అండగా ఉంటాం..

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు
- నేతలు, కార్యకర్తలకు భరోసా



పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: కార్యకర్తలు, నాయకులెవ్వరూ అధైర్య పడవద్దని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ భరోసా ఇచ్చారు. సోమవారం ఆయన రూరల్ నియోజకవర్గంలోని గ్రామాల పర్యటనను కొంతమూరు నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ మైనార్టీ నాయకులు ఎంఎం ఆలీ నివాసంలో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వ అక్రమాలను భయపడకుండా, ధైర్యంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని, ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. రూరల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. 2029లో మరలా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉప సర్పంచ్‌లు చెరుకూరి సత్యనారాయణ, షేక్ మౌలాలి, మైనార్టీ నాయకులు ఎంఎం ఆలీ, పిల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మనిషి జీవితంలో అక్షరం ఎంతో విలువైంది



యానిమేటర్లకు పుస్తకాలు అందజేస్తున్న కుమారి తదితరులు

సీటీఆర్ఐ: మనిషి జీవితంలో అక్షరం అత్యంత విలువైందని చాంబర్ ఆఫ్ కామర్స్ రాజమండ్రి డైరెక్టర్, లయన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్ కొయ్యాన కుమారి అన్నారు. రాజమహేంద్రవరంలోని గ్రేస్ చారిటబుల్ ట్రస్టు, ఇండియా లిటరసీ ట్రస్ట్ చెన్నై ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వయోజన విద్యా కేంద్రాల ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ మేరకు శానిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వయోజన కేంద్రాల యానిమేటర్లకు విద్యా మెటీరియల్ పంపిణీ చేశారు. గ్రేస్ ట్రస్ట్ ఫౌండర్ రోషన్ వర్జిల్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా 10 వయోజన విద్యా కేంద్రాలు నిర్వహిస్తున్నామని, వీటికి సంబంధించి 10 మంది యానిమేటర్లకు ఏలూరులో శిక్షణ ఇచ్చామన్నారు. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాలలో నిరక్షరాస్యులకు అక్షర జ్ఞానంతో పాటూ స్త్రీలకు స్వయం ఉపాధి శిక్షణ ఇస్తామన్నారు. హరిత దళం మేనేజర్ వై.చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం యానిమేటర్లకు పుస్తకాలు, పలకలు, నల్ల బల్లలు అందజేశారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరిలో దూకి రాజమహేంద్రవరానికి చెందిన సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి (54) సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డారు. మోటారు సైకిల్‌ను వంతెనపై విడిచిపెట్టిన అతడు నదిలో దూకారు. స్థానిక జాలర్ల సాయంతో గాలించగా రాత్రి మృతదేహం లభ్యమైంది. బోటు సాయంతో మృతదేహాన్ని ఒడ్డుకి చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. రాజమహేంద్రవరంలో విద్యుత్ నగర్‌లో శ్రీనివాసరెడ్డి నివాసం ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య భువనేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ హెడ్ కానిస్టేబుల్ సాంబమూర్తి తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి పదేళ్ల కుమారుడు, భార్య ఉన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



కడియంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కడియం: తల్లీశిశువుల ఆరోగ్య పరిరక్షణతో ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించగలుగుతామని కడియం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు ఎం.మణిజ్యోత్స్న అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన కడియంలో సోమవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, పోషకాహార ప్రాధాన్యతను తెలియజేశారు. వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో అర్జీల పరిష్కారం



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

కంబాలచెరువు: వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను చట్ట పరిధిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పోలీస్ పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 46 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్‌బీఎం.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ (ఎస్‌బీ) బి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ (ఎస్‌బీ) శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ (డీసీఆర్‌బీ) పవన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

23 అర్జీలు అందజేత

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన జీజీఆర్ఎస్ – మీకోసం కార్యక్రమానికి ప్రజల నుంచి 23 అర్జీలు అందాయని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. వాటిని నిబంధనల మేరకు సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వి.వినూత్న పాల్గొన్నారు.

పీఎంపీలు ఆరోగ్య అవగాహన కల్పించాలి

పీఎంపీ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజు



వైద్యులను సత్కరించిన సంఘ సభ్యులు

కంబాలచెరువు: తల్లులు, నవజాత శిశువుల ఆరోగ్యంతో పాటు, ప్రసూతి, శిశు మరణాల నివారణకు అవగాహన కల్పించేందుకు పీఎంపీలు ముందుండాలని పీఎంపీ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక జేఎన్ రోడ్‌లో సంఘ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి అధునాతన శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ నితిన్ రిమ్మలపూడి మాట్లాడుతూ, వివిధ అధునాతన శస్త్రచికిత్స విధానాలను వివరించారు. హృద్రోగ నిపుణుడు డాక్టర్ వి.జీవన్ మాట్లాడుతూ, ధూమపానం, మద్యపానం, వ్యాయామం లేకపోవడంతో గుండె వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ దివ్య మాట్లాడుతూ, మహిళలకు సంబంధించిన వివిధ క్యాన్సర్ సమస్యలను వివరించారు. డాక్టర్ చైత్ర రిమ్మలపూడి మాట్లాడుతూ, 35 ఏళ్లు దాటాక మహిళలు తీసుకునే వ్యాక్సిన్లను వివరించారు. రాజమండ్రి విశ్రాంత ఆరోగ్య అధికారి డాక్టర్ ఎంవీఆర్ మూర్తి, సంఘ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, ప్రతినిధులు గంగుమళ్ల రాంబాబు, కోన చిన్నారావు, పి.దేవానందం, బుడ్డిగ అప్పారావు, రహమాన్ ఖాన్, ఎ.ధనుంజయ్ వివిధ అంశాలపై ప్రసంగించారు. అనంతరం వైద్యులను సంఘ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల సభ్యులు హాజరయ్యారు.